క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం



హోమం చేస్తున్న కౌన్సిలర్ సరిత, యాదగిరి దంపతులు, భక్తులు

షాద్‌నగర్ టౌన్: పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలో వెలసిన పోచమ్మ, కట్టమైసమ్మ ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని చండీ హోమం నిర్వహించారు. కౌన్సిలర్ నడికూడ సరిత, యాదగిరి యాదవ్ దంపతులు హోమం చేశారు. పూజలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నల్లమోని భిక్షపతి, శ్రీను, శ్రీశైలంగౌడ్, బాస రాజు, నర్సింలు, రాచమళ్ల రమేష్, తులసీరాం, మంగలి సురేష్, మధుసూదన్, నర్సింలు, విప్పరి నరేష్, బుర్ర లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వేరో స్టూడెంట్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

చేవెళ్ల: పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు స్వేరో స్టూడెంట్ యూనియన్ అండగా పనిచేస్తుందని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల కమిటీ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అధ్యక్షుడిగా పవన్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, కార్యదర్శిగా ఆకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

నేత్రపర్వంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మండలంలోని దేవునిపల్లిలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ చేగూరి రాఘవేందర్‌గౌడ్ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతో ఆకట్టుకున్నాయి. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న టీచర్లు

షాద్‌నగర్: విద్యారంగంలో ఉత్తమ సేవలందించి హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా విదూషన్ ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఠాగూర్ పాఠశాల అధినేత ఎన్కే రాజేంద్రప్రసాద్‌ను శుక్రవారం బీఏఎం కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు మంచి విలువలతో కూడిన విద్య అందించేందుకు ఎన్కే రాజేంద్ర ప్రసాద్ అనేక విద్యా సంస్థలను స్థాపించారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్యగౌడ్, అధ్యాపకులు నాగరాజు, విజయ్, రాజు, రమేష్, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



వైద్యురాలు రుూస్నీని సన్మానిస్తున్న సర్పంచ్ గోవింద్ అశోక్ తదితరులు

నందిగామ: గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సప్పగూడ గ్రామ సర్పంచ్ గోవింద్ అశోక్ సూచించారు. శుక్రవారం సబ్‌సెంటర్‌లో డాక్టర్ రుూస్నీ బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలందరికీ వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో గ్రామానికి డాక్టర్‌ను నియమించిందని తెలిపారు. ఉప సర్పంచ్ కాట్న శేఖర్, ఏఎంసీ డైరెక్టర్ కంధ్యానం యాదయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహులు, కారోబార్ లింగం పాల్గొన్నారు.

కొత్త పంచాయతీలకు మహర్దశ

- నాలుగు జీపీలకు నూతన భవనాలు
- రూ. 20 లక్షలచొప్పున నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచులు



ఎత్‌మార్‌పల్లిలో రేకుల భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయం

మొయినాబాద్ రూరల్: కొత్త పంచాయతీలకు నూతన భవనాలు నిర్మించాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా ఒక్కో పంచాయతీలో భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేసింది. మండలంలో ఏడు నూతన పంచాయతీలు ఏర్పడగా వాటిలో నాలుగు జీపీలకు భవనాలు మంజూరయ్యాయి. ఎత్‌మార్‌పల్లి, అప్పారెడ్డిగూడ, ఎల్కగూడ, అప్పోజిగూడ పంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు విడుదలయ్యాయి. కొత్త పంచాయతీలకు సొంత భవనాలు లేక పాలక వర్గం ఇబ్బందులు పడ్డాయి. నాలుగు సంవత్సరాలుగా అవస్థలు పడుతూ వచ్చారు. మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఏడు అనుబంధ గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. వీటికి సొంత భవనాలు మంజూరు కావడంతో సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు పంచాయతీలకు శాశ్వత భవనాలు లేకపోవడంతో డ్వాక్రా భవనాలు, యువజన సంఘ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగిస్తూ వచ్చారు.

సంతోషంగా ఉంది



నాలుగేళ్ల క్రితం ఎత్‌మార్‌పల్లికి పంచాయతీ హోదా లభించింది. అప్పటి నుంచి గ్రామంలోని డ్వాక్రా భవనంలో గల రేకుల గదిలో పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చాం. ప్రస్తుతం నూతన భవనాలకు నిధులు మంజూరయ్యాయి. కొత్త భవనం అందుబాటులోకి వస్తే ఇబ్బందులు తీరుతాయి.

– నవనీత, ఎత్‌మార్‌పల్లి సర్పంచ్

కొత్త జీపీలకు నిధులు



మండలంలోని ఏడు కొత్త గ్రామ పంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. వీటితో నూతన భవనాలు నిర్మించనున్నాం. వెంటనే పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూస్తాం. సర్పంచులు కూడా ఇందులో పాలుపంచుకోవాలి.

– సంధ్య, ఎంపీడీవో, మొయినాబాద్

త్వరలో పనులు ప్రారంభం



కొత్త గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఒక్కో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షల చొప్పున సర్పంచ్ ఖాతాలో జమ అవుతాయి. ఎత్‌మార్‌పల్లి, అప్పారెడ్డిగూడ, ఎల్కగూడ, అప్పోజిగూడ గ్రామాల్లో నూతన భవనాలు నిర్మిస్తాం. అదే విధంగా షాబాద్ మండలం బోడంపాటు, చర్లగూడ, గొల్లూరుగూడ, కొమరబండ, కుమ్మరిగూడ, మద్దూర్, మల్లారెడ్డిగూడ, నారెళ్లగూడ, పెద్దవెడు, సంకెపల్లిగూడ తోపాటు షాబాద్ గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభిస్తాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి

- శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ సభ్యుల డిమాండ్
- టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతి



సజ్జనార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

శంకర్‌పల్లి: పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడపాలని శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌కు నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంకర్‌పల్లి నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు లేక ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. వెంటనే బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. మండలంలోని మోకిల వరకు ఉన్న సబర్బన్ సిటీ పాస్‌ను శంకర్‌పల్లి వరకు పొడగించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వేనేంద్ర, మహేందర్‌రెడ్డి, రాజు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల బాధ్యత ప్రభుత్వానిదే

- ఎమ్మార్పీఎస్ మండల నాయకులు



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శంకర్‌పల్లి: రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లల బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని కోరుతూ శుక్రవారం శంకర్‌పల్లికి వచ్చిన మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమ కార్యచరణ కార్యక్రమంలో అనాథ పిల్లలకు ప్రత్యేక రిజర్వేషన్లు, గురుకుల జూనియర్ కళాశాల కళాశాలలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాడిగళ్ల ప్రవీణ్, నాయకులు గండయ్య, వంశీ, లక్ష్మయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ విద్యాలయాలతో ఆరోగ్య సమాజం

- స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ రాజు
- అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల సందర్శన



విద్యార్థులకు చేతులు శుభ్రంపై అవగాహన కల్పిస్తున్న రాజు తదితరులు

మొయినాబాద్ రూరల్: స్వచ్ఛ విద్యాలయాలతో ఆరోగ్య వంతమైన సమాజం ఆవిష్కృతం అవుతుందని, ఇందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇంటర్నేషనల్ వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎంఎస్‌టీ రాజు పిలుపునిచ్చారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సంస్థ ప్రతినిధులు మండలంలోని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్నేషనల్ వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో కలిసి పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు హ్యాండ్ వాష్, ప్లేట్ వాష్, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం నర్సింహ్మారావు, ఉపాధ్యాయులు పెంటయ్య, శోభారాణి తదితరులతో కలిసి సమావేశం నిర్వహించారు. మన ఊరు – మన బడిలో భాగంగా స్వచ్ఛ విద్యాలయం ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పది మందికి ఒక టాయిలెట్స్, బాత్‌రూమ్, చేతులు శుభ్రం చేసుకునేందుకు నల్లాలు, భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే క్రీడా సామగ్రి సమకూర్చనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలను ఇందు కోసం ఎంపిక చేసుకున్నట్లు వారు తెలిపారు. ఈ పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ఈ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అనూష అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను కలిశారు. చికిత్స నిమిత్తం రూ. 2లక్షల రూపాయల చెక్కును సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేయించి వారికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ యాదవ్, డోలీ రవీందర్, రాజేందర్‌గౌడ్, ఏనుగు జనార్దన్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో చెన్నయ్య

షాద్‌నగర్ టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులో శుక్రవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకుడు నల్లమోని శ్రీధర్ ఆధ్వర్యంలో నూతన వార్డు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు కమిటీ అధ్యక్షుడిగా నల్లమోని సిద్దు, సభ్యులుగా మంచిర్యాల సురేష్, ఎండీ మైబు, బీరయ్య, శ్రీనివాస్, రవి, గంగమోని సత్తయ్య, తులసీరాం, ఆరీఫ్‌లను ఎన్నుకున్నారు.

మార్కండేయ ప్రాజెక్టును పూర్తి చేయండి

- అప్పటిదాకా పోరాటం ఆగదు
- పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్
- కాంగ్రెస్ నేతలపై దాడులు అమానుషం



సమావేశంలో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలో నిర్మించ తలపెట్టిన మార్కండేయ ప్రాజెక్టును ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని, ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయ్యే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. మార్కండేయ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించేందుకు వెళ్లిన కాంగ్రెస్ నేతలు వాల్యా నాయక్, రాములు తదితరులపై బీఆర్ఎస్ పార్టీ నేతలు దాడులకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. బిజినేపల్లి గ్రామ శివారులో రూ. 77కోట్లతో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 17 గిరిజన తండాల పరిధిలోని ఏడు వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి కాల్వ ద్వార 40 మీటర్ల ఎత్తున నిర్మిస్తున్న ప్రాజెక్టు నిర్మాణంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. హామీల ప్రశ్నించే నేతలపై బీఆర్ఎస్ నేతలు దాడులకు పాల్పడడం దారుణమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో నాయకులు యాదయ్య యాదవ్, బాలరాజ్‌గౌడ్, అందె మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది మా ప్రభుత్వమే

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివరాజ్



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు శివరాజ్

కొందుర్గు: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివరాజ్ అన్నారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టే దిశగా కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్ గుప్తా, అందె బాబయ్య, మిథున్‌రెడ్డి, శ్రీశైలం, లక్ష్మయ్యగౌడ్, ప్రభులింగం, లక్ష్మీకాంత్ రెడ్డి, శంకర్, అంజయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కొందుర్గు: ప్రతి పల్లెలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ నెల 26న ప్రారంభించనున్న హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలన్నారు. అన్ని గ్రామాల నుంచి భారీ ఎత్తున తరలివెళ్లాలన్నారు. అదేవిధంగా అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అటు దేశం, ఇటు రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆకాంక్షించారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరేందర్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు యాదయ్య, రవి, మలయ్య, నర్సింలు, శ్రీనివాసరెడ్డి, అమృతయ్య, రమేష్, అనంతయ్య, పద్మయ్య, శ్రీనివాసు, గోపాల్ రెడ్డి, ఎండి బాబా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ షాద్‌గనర్ పాలక్ బాలకృష్ణారెడ్డి



బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ షాద్‌నగర్ పాలక్ జిట్టా బాలకృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ కార్యాలయాన్ని బాలకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటాను ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు, నాయకులు పసుల నర్సింహయాదవ్, పల్లె ఆనంద్‌కుమార్, పాండురంగారెడ్డి, అంజయ్య, మహేందర్‌రెడ్డి, రఘురాములు గౌడ్, కంచుకోట మహేష్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనూహ్య స్పందన

నియోజకవర్గంలో రెండో రోజు శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల వద్ద దృష్టి లోపం, కంటి సమస్యలు ఉన్నవారు భారీగా తరలి వచ్చారు. వారిని పరీక్షించిన వైద్యులు అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు ఇచ్చారు. మరి కొందరికి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యవేక్షించారు.



చేవెళ్ల: కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారులు



కేశంపేటలో వివరాలు నమోదు చేసుకుంటున్న వైద్య సిబ్బంది

మరీ ఇంత నిర్లక్ష్యమా..!

- మూడు నెలలుగా సాగుతున్న సురంగల్ రోడ్డు పనులు
- కంకర పోసి వదిలేయడంతో తరచూ ప్రమాదాలు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డు పనుల కారణంగా ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు, ట్రాలీ ఆటో

మొయినాబాద్: అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా సురంగల్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడు నెలలుగా పనులు జరుగుతున్నా నేటికీ పూర్తి కాలేదు. అసంపూర్తి పనుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిలుకూరు నుంచి మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం ఏడాది క్రితం రూ. 2.20 కోట్లు మంజూరు చేసింది. ఆరు నెలల క్రితం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. రెండు నెలల తరువాత కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి పాత బీటీ రోడ్డును పూర్తిగా తవ్వేశారు. రోడ్డుకు ఇరుపక్కలా మట్టిపోసి ఎత్తు పెంచారు. మధ్యలో కంకర పోయడానికి అర అడుగు లోతుతో గుంతలాగా వదిలేశారు. కొన్ని చోట్ల కంకర పోసి.. మరి కొన్ని చోట్ల కంకర పోయకుండా వదిలేయడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ ఉన్న సమయాల్లో, రాత్రి సమయంలో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం సురంగల్ నుంచి మొయినాబాద్ వస్తున్న స్కూల్ బస్సు, మొయినాబాద్ నుంచి సురంగల్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో ప్రమాదానికి గురయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసి ఎత్తు చేయడంతో ఎదురెదురుగా వచ్చిన వాహనాలు ఒకదానికొకటి తగిలాయి. ఆ సమయంలో స్కూల్ బస్సులో విద్యార్థులు ఉన్నా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇలాంటి ప్రమాదాలు ప్రతి రోజు జరుగుతున్నాయని, రోడ్డు పనులు త్వరగా చేయడంలో కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఐసడక్ ప్రతినిధులు

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఐసడక్ టోల్‌ప్లాజా సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన జలశుద్ధి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసడక్ టోల్ ప్లాజా ప్రతినిధులు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటుగా శుద్ధి చేసిన నీటినే తాగాలన్నారు. ప్రజలందరికి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఐసడక్ టోల్‌ప్లాజా ప్రతినిధి ఇబ్రహీం, సర్పంచ్ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ ఆశన్న గౌడ్, ఎంపీటీసీ అరుణ, హెచ్ఎం కృష్ణయ్య, సువర్ణ, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.